శృంగార వల్లభ స్వామికి రూ 4.49 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం రూ.4.49 లక్షల ఆదాయం చేకూరినట్లు ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. వివిధ టిక్కెట్ల ద్వారా రూ.3,63,450, అన్నదాన విరాళాల ద్వారా రూ.81,441, కేశఖండన ద్వారా రూ 4,320, తులాభారం ద్వారా రూ.400 ఆదాయం సమకూరిందని వివరించారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ధర్మ కర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్ సేవలందించారు.

అభివృద్ధి కమిటీల జాడేదీ..?

- అరకొరగా హెచ్‌డిఎస్‌సి సమావేశాలు
- పిహెచ్‌సిల్లో కానరాని సౌకర్యాలు
- సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం
- గ్రామీణ ప్రాంత రోగులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిఠాపురం మండలం మల్లం పిహెచ్‌సి పరిధిలో 12 గ్రామాలు ఉన్నాయి. సుమారు 33 వేల మంది జనాభా ఉండగా రోజుకి సరాసరి 120 ఓపి నమోదు అవుతుంది. ఇక్కడ సరిపడా భవనాలు, సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అటు ఉద్యోగులకు, ఇటు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాస్తవానికి 42 రకాల వివిధ రక్త పరీక్షలు చేస్తున్నామని వైద్య అధికారులు చెబుతున్నప్పటికీ నామమాత్రపు పరీక్షలతో సరిపెడుతున్నారని రోగులు వాపోతున్నారు. ఎంపిపి చైర్మన్‌గా ప్రతినెలా జరుగుతున్న ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం తూతూమంత్రంగానే ముగుయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల అసలు సమావేశాలే జరపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైద్యులు, సిబ్బంది, మందుల కొరతతో ఇబ్బందులు, వెంటాడుతున్న అసౌకర్యాలు నడుమ జిల్లాలో పలు పిహెచ్‌సిలలో రోగులను సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు సక్రమంగా అందే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో గతంలో ఆస్పత్రుల అభివృద్ధి సొసైటీ కమిటీ (హెచ్‌డిఎస్‌సి) కమిటీల పాత్ర కీలకంగా ఉండేది. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో ఈ కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే మిగులుతున్నాయి. దీంతో పిహెచ్‌సిల అభివృద్ధి కుంటుపడే పరిస్థితులు నెలకున్నాయి. ప్రస్తుతం పలు రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్న వేళ సమస్యలను పట్టించుకునే నాథులు కరువయ్యారు.

పిఠాపురం మండలం మల్లంలో శిథిలావస్థకు చేరుకున్న పిహెచ్‌సి

మొక్కుబడిగా సమావేశాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 126 పిహెచ్‌సిలు ఉన్నాయి. పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందాలని, ఆసుపత్రుల్లో సమర్థవంతమైన పనితీరు కనబర్చాలన లక్ష్యంతో ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీ కమిటీలను ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కమిటీలను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించడం, వసతులు, తగిన మందులు ఉండేలా చూడటం, నిధులను అవసరం మేరకు ఖర్చుచేయడం వంటివి ఈ కమిటీలు చూడాల్సి ఉంది. పిహెచ్‌సి కమిటీలో చైర్మన్‌గా ఎంపిపి, కన్వీనర్‌గా వైద్యాధికారి, సభ్యులుగా ఎంపిడిఒ, తహశీల్దార్, గ్రామ సర్పంచితోపాటు ఎంపిపి నామినేట్ చేసిన మహిళా సర్పంచి ఒకరు ఉంటారు. కొన్ని పిహెచ్‌సిల పరిధిలో కమిటీల సమావేశాలు రెగ్యులర్‌గా జరుగుతున్న చాలాచోట్ల రెండు మూడు నెలలకు కూడా జరపడం లేదు. జరుగుతున్న చోట్ల కూడా మొక్కుబడిగా సమావేశాలను అధికారులు పూర్తి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా కేంద్రాల అభివృద్ధి వైపు చర్చ జరగడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

మెరుగైన వైద్య సేవలు మృగ్యం

సీజనల్ వ్యాధులు, దోమల దండయాత్రతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతర రోగాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సక్రమమైన వైద్య సేవలు అందాల్సి ఉంది. అయితే కొన్ని పిహెచ్‌సిల్లో మాత్రమే సరైన సేవలు అందుతున్నా ఎక్కువ కేంద్రాల్లో రోగులకు సంతృప్తికరమైన వైద్యం అండడం లేదు. ప్రభుత్వం ఇప్పటికే మందులు, సర్జికల్ పరికరాల కొనుగోలుకు భారీగా బడ్జెట్ తగ్గించింది. దీంతో పలు ఆరోగ్య కేంద్రాల్లో కనీసం సిలైన్ పెట్టేందుకు సైతం సంబంధిత క్యాన్లీలా, సూది కూడా అందుబాటులో లేవని రోగులు ఆవేదన చెందుతున్నారు. షుగరు, టైఫాయిడ్, హెచ్‌బి వంటి కొన్ని పరీక్షలు మాత్రమే జరుగుతున్నారు. వాటి ఫలితాలు కూడా త్వరితగతిన చాలాచోట్ల ఇవ్వడం లేదు. దీంతో రోగులు సంఖ్య ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గణనీయంగా తగ్గుతూ వస్తుంది.

వేధిస్తున్న సౌకర్యాల కొరత

పలు కేంద్రాల్లో పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండడం లేదు. పారిశుధ్యం పడకేసింది. పూర్తి స్థాయిలో సిబ్బంది కరువయ్యారు. ఉన్న సిబ్బంది పనితీరు మెరుపడడం లేదు. సరిపడా వైద్యులు పోస్టుల భర్తీ లేదు. నలుగురు ఉండాల్సిన చోట ఇద్దరు, ముగ్గురు ఉండాల్సిన చోట ఒక్కరే ఉంటున్నారు. అనేక భవనాలు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడు లేరు. తాగునీటి వసతి, రోగులు ఉండే చోట ఫ్యాన్లు, లైట్లు లేకపోవడం నిరంతర విద్యుత్తు సరఫరా ఇలా అనేక సమస్యలతో రోగులు సతమతం అవుతున్నారు. వివిధ ప్రమాదాల్లో గాయపడిన వారికి పలు పిహెచ్‌సిలలో ప్రాథమిక వైద్యసేవలే అందుతున్న పరిస్థితులు ఉన్నాయి. ట్రామాకేర్ సేవలు అందడం లేదు. ఆర్థోపెడిక్, మత్తు డాక్టర్లు లేక రోగులు ఆపరేషన్ల కోసం జిల్లా కేంద్రం కాకినాడ జిజిహెచ్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఎక్సరే సౌకర్యాలు ఉండడం లేదు. డబ్బులు వెచ్చించి ప్రయివేటుగా తీయించాల్సి వస్తోంది. ఇలా పలు సమస్యలు ఆరోగ్య కేంద్రాలను వెంటాడుతున్నాయి.

చలో ఢిల్లీ సన్నాహక సమావేశంలో చర్చిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

14న రైతాంగ చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 14న నిర్వహిస్తున్న రైతాంగ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. స్థానిక కచేరి పేటలో సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంక టేశ్వర్లు అధ్యక్షతన చలో ఢిల్లీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ మాట్లాడారు. పరిశ్రమల్లో తయారయ్యే సరుకులకు ఎంఆర్‌పి ఎలా అయితే ఉంటుందో రైతులు పండించే పంటలకు మద్దతు ధర కచ్చితంగా చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం ఉద్యమం, రైతుల కష్టాలపై బిజెపి పరివారం అవహేళనచేస్తూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాన్ని సాగిస్తున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా కనీసం మద్దతు ధర చట్టం చేస్తే రూ.20 వేల కోట్లు మాత్రమే అవుతుందని, ఇది ప్రధాని మోడీ కోసం నిర్మించిన గృహానికైన ఖర్చుతో సమానమన్నారు. ఈ పదేళ్ల కాలంలో వ్యవసాయం గిట్టుబాటు కాక, అప్పులపాలై 1 లక్షా 60 వేల రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇవి మోడీ ప్రభుత్వం చేసిన హత్యలేనని మండిపడ్డారు. మధ్య దళారి లాభాలను కాపాడటం కోసం, కార్పొరేట్లకు రూ.45 లక్షల కోట్లు విలువచేసే వ్యవసాయాన్ని అప్పగించడం కోసం రైతుల సమస్యలు పరిష్కరించడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికి 70 శాతం ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న రంగం వ్యవసాయమేనని అన్నారు. తక్షణం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు చెక్కల రాజకుమార్, తోకల ప్రసాద్, అంజిబాబు, వల్లూరి రాజబాబు, తిరుమల శెట్టి నాగేశ్వరరావు, తాళ్లూరి రాజు, జ్యోతి, చంద్రమళ్ల పద్మ, రొంగల ఈశ్వరరావు, దుంపల ప్రసాద్, మలకా రమణ, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 11న విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి రైతాంగ సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని పులిమేరు గ్రామంలో నిర్వహించిన సభలో రైతంగ సదస్సు కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలతోపాటు వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సభలో వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, దేశెట్టి సురేష్, వి.సత్తిబాబు, నారాయణరావు, భూషణం, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మెడికవర్ హాస్పిటల్లో మోడ్రన్ టెక్నాలజీ ఉపయోగించి ఎలాంటి కోత లేకుండా 5 ఏళ్ళ చిన్నారికి గుండె ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అల్లూరి అశోక్‌రాజు, డాక్టర్ మాతా శ్రీనివాస్, డాక్టర్ పి.ప్రణవ్, డాక్టర్ నరేష్, క్లస్టర్ హెడ్ సిద్ద రెడ్డి తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం గ్రామానికి చెందిన 5 ఏండ్ల సౌమ్యకి పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధి ఉందన్నారు. తమ ఆసుపత్రికి వచ్చిన ఆ చిన్నారికి ఆరోగ్యశ్రీ పథకంలో డివైస్ క్లోజర్ ప్రొసీజర్ ద్వారా ఆ చిన్నారికి గుండెకు శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆసుపత్రిలో పెద్దవారికి మాత్రమే గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించామని, ప్రస్తుతం చిన్నారులకు కూడా ఆధునిక పరిజ్ఞానంతో కుట్టు, కోత లేకుండా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కాకినాడకు చెందిన 5 ఏళ్ల ఆడ శిశువుకు గుండెలో ఏట్రియాల్ సెప్టల్ డిఫెక్ట్ అనే పెద్ద రంధ్రం ఉన్నట్లు నిర్ధారణ అయిందని, ఆ చిన్నారికి ఆధునిక డివైస్ క్లోజర్ ప్రొసీజర్ ద్వారా విజయవంతంగా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించడం జరిగిందన్నారు. పదేళ్ల లోపు వయసు కలిగిన వీరు శస్త్ర చికిత్స జరిగిన రెండు రోజుల్లో కోలుకుని నడవడం జరిగిందన్నారు సాధారణంగా హార్ట్ సర్జరీ జరిగిన పిమ్మట సంవత్సరం వరకు ఎవరు కోరుకోలేరని, ఇప్పుడు కొత్త విధానం ద్వారా కేవలం రెండు రోజుల్లో మనిషి కోలుకుని నడవడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్సల వైద్య సౌకర్యం ఉందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. తమ బిడ్డకు పునర్జన్మనిచ్చిన మెడికోవర్ వైద్యులకు సౌమ్య తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

అరబిందో ఫార్మా పైపులైన్ తొలగించాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అరబిందో ఫార్మా పైపులైన్లు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానికంగా గత 4 రోజులుగా ఆందోళన చేస్తున్న మత్స్య కారుల శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పైపులైన్ వల్ల కలుగుతున్న ఇబ్బందులపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే మత్స్యకారులు తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని, అయినా ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. పరిశ్రమకు సంబంధించిన వ్యర్థాలను సముద్రంలోకి కలపడం ద్వారా మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసేలా కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తుం దన్నారు. ఎంపి వంగా గీత మత్స్యకారుల శిబిరాన్ని సందర్శించినా మత్స్యకారులకు అండగా నిలుస్తామనే మాట రాలేదని, పైపులైన్‌ను అడ్డుకోవడం సాధ్యం కాదని చెప్పడం సిగ్గుచేటన్నారు. మత్స్యకారులకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరించడం సరికాద న్నారు. తక్షణమే మత్స్య కారుల డిమాండ్లను పరిష్కరించేలా జిల్లా అధికార యంత్రాంగం చొరవచూపాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల ఉద్యమానికి మత్స్య కార్మిక సంఘం అండగా ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్ర శేఖర్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.రమణి పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆందోళనలో మాట్లాడుతున్న కొల్లాటి శ్రీనివాసరావు

జీవనభృతికి అవరోధం లేకుండా చూస్తా..ఎంపి గీత

మత్స్యకారులు వేటకు వెళ్ళడానికి అవరోధం లేకుండా బోట్లు, వలలు దెబ్బతినకుండా వేట సజావుగా సాగేలా చూస్తానని ఎంపి వంగా గీత హామీ ఇచ్చారు. గత నాలుగు రోజులుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళన శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం నాయకులు పల్లేటి బాపన్నదొర, కంబాల దాసుబాబు, ఉమ్మిడి చిన్న మాట్లాడుతూ అరబిందో ఫార్మా కంపెనీ విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల మత్స్య సంపద నశించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం కలెక్టర్, రెవెన్యూ అధికారులు, అరబిందో ఫార్మా కంపెని ప్రతినిధులతో మత్స్యకారుల సమస్యపై చర్చిస్తానని అన్నారు.

కవాతును నిర్వహిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

ప్రత్తిపాడులో రక్షణ బలగాల కవాతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రానున్న ఎన్నికల నేపథ్యంలో కేంద్ర రక్షణ బలగాలు సాయుధ పోలీసులు ప్రత్తిపాడు, ఒమ్మంగి, చింత లూరు గ్రామాల్లో కవాతు నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రతిపాడు సిఐ ఎం.శేఖర్‌బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా, సజావుగా ఎన్నికల్లో పాల్గొనేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన కేంద్ర రక్షణ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. అనంతరం చింతలూరులో జరిగిన ఎన్నికల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర రక్షణ బలగాలైన సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్ బృందాలను సమస్యాత్మకు గ్రామాల్లో మోహరిస్తామన్నారు. ప్రజలందరూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపా డు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్ఐలు ఎం.పవన్ కుమార్, జి.సతీష్, వి.కిషోర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు



పార్టీలో చేరిన నాయకులతో జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని శృంగారాయునిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ డైరెక్టర్, వైసిపి నాయకులు తిరుమల సత్యానందం, పోకల సీతన్న, పోకల బాబు రావు టిడిపిలో చేరారు. వైసిపికి రాజీనామాలు ప్రకటించిన వారు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లా డుతూ ఒక్కసారి అవకాశం ఇవ్వండి అనే పిలుపుతో ప్రజలు అధికారాన్ని అప్పగిస్తే ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని అన్నారు. రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టుతున్న వైసిపిని గద్దిదించేందుకే తాము ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరుతున్న ట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గూడె బాల, సర్పంచ్ పట్టు చంటిబాబు, ఎంపిటిసి సభ్యులు గరగ గోవిందు, ఉప సర్పంచ్ బొజ్జపు శ్రీను, అల్లుమల్ల వెంకన్న, బొజ్జపు నాగేశ్వరరావు, అల్లు మల్ల బాబి, గోడే బాసు పాల్గొన్నారు.

అమ్మకు వందనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామంలో వాణి విద్యానికేతన్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మకు వందనం పేరుతో తల్లులకు చిన్నారులచే పాద పూజ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ధూళిపూడి చందు, హెచ్.ఎం.శ్రీలక్ష్మి, నాయకులు యు.వెంకటేశ్వరరావు, దూళిపూడి వెంకటరమణ, దూళిపూడి సుబ్బారావు, ధూళిపూడి శాస్త్రి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



తల్లులతో చిన్నారులు

పాస్టర్లతో వరుపుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాబోయే ఎన్నికల నేపథ్యంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు క్రైస్తవ మతానికి చెందిన పాస్టర్లతో శనివారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా వైసిపి ప్రభుత్వం క్రైస్తవ పాస్టర్లకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని అందిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి పాస్టర్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు, జడ్‌పిటిసి సభ్యులు కొల్లు చిన్నదివాణం, నాయకులు బెహరా రాజేశ్వరి, అలమండ చలమయ్య, వరుపుల సత్య సూరిబాబు, ముత్యాల సతీష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల

కార్టూ'నిజం'

ఆ నష్టాన్ని ఎన్నికలయ్యాక రెండు రెట్లు పెంచి పూడుస్తామయ్యా..!!

35వ రోజుకు శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 35వ రోజుకు చేరింది. ఆసుపత్రి మాతా శిశు విభాగం వద్ద నుంచి ఒపి విభాగం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయ్‌కుమార్, కమిటీ సభ్య రాలు సిహెచ్.పుష్ప మాట్లాడుతూ తమ కష్టం అందరికీ తెలిసిందేనని, అయితే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ జోక్యంతో కాంట్రా క్టర్స్ తమతో చర్చలు జరిపారని తెలిపారు. అయితే పిఎఫ్ ఖాతాకు చెల్లించాల్సిన రూ.1600 ల్లో కేవలం రూ.600 మాత్రమే చెల్లించేందుకు ముందుకు వచ్చా రని, ఇది తమకు అంగీకారం కాదన్నారు. చట్ట ప్రకా రం కాంట్రాక్టర్ చెల్లించాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ సొమ్ము ను పూర్తిగా కాంట్రాక్టర్ చెల్లించాల్సిందేనని, అప్పటి వరకూ తమ ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేసే లక్ష్యంలో భాగంగా ఎమర్జెన్సీ సేవలు మినహాయించి కార్మికులు సమ్మెకు దిగాలని నిర్ణయించినట్లు తెలి పారు. ఈ సందర్భంగా జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూ నియన్ నాయకులు ఏసూరి శ్రీను, జిఎస్ఆర్.కృష్ణ, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి జిఎస్.నాయుడు, పోర్ట్ సర్వే అండ్ టాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాలిక రాజేంద్రప్రసాద్ జిజిహెచ్ శానిటేషన్ కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ కార్య క్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎస్.వాసు, దుర్గాప్రసాద్, ఎం.రవి పాల్గొన్నారు.

జిజిహెచ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

బాధిత కుటుంబానికి సరుకులు అందిస్తున్న జ్యోతుల, అప్పలరాజు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గొల్లలగుంట గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జ్యోతుల నెహ్రూ అండగా నిలిచారు. ఈ నెల 7న జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన ఏదూరి అప్పారావు ఇళ్లు దహనం అయ్యింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఆయన శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి తక్షణం అవసరమైన బియ్యం, నిత్యావసర వస్తువులు, బట్టలు అందించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు, పక్కా గృహాన్ని ప్రభుత్వమే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచే తాతాజీ, పాలచర్ల సత్యనారాయణ, పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూని ట్-5 ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని రాజీవ్, ఎన్‌టిఆర్ కాలనీల్లో గత 7 రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం శనివారంతో ముగిసిం ది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో ఎంఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వీరయ్య చౌదరి, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి మాట్లాడారు. వారం రోజులపాటు ఈ రెండు కాలనీలలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. వాలంటీర్లు పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనం - పరిశుభ్రత, వనం- మనం కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రత పై నిర్వహించిన స్వచ్ఛతే సేవ కార్యక్రమాలు, ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు ఈ ఎన్‌ఎస్‌ఎస్ పిఒ మేడిశెట్టి తాతాజీ ముగింపు సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలో ఉపాధ్యాయులు జివివి.సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



వాలంటీర్‌కు బహుమతి ఇస్తున్న ప్రిన్సిపల్ వీరయ్య చౌదరి

జిల్లాలో మారుతున్న సమీకరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో అధికార వైసిపి, విపక్ష టిడిపి, జనసేన పార్టీల నేతలు సమీకరణాలు ముమ్మరం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన విషయం విదితమే. మరికొన్ని నియోజకవర్గాల్లో ఆశావహులు అధినేతల ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఎన్నికల కోడ్ విడుదలైన అనంతరం ప్రచారాలు, అభ్యర్థుల తాయిలాలు, హామీలు గుప్పించడం పరిపాటి. అయితే తాజా ఎన్నికల్లో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల కోడ్‌కు ముందే ప్రచార జోరు ఊపందుకుంది. గ్రామాలలో మొదలై నియోజకవర్గ కేంద్రాల వరకూ అధికార, విపక్ష నేతలు ప్రచారాస్త్రాలు పదును పెట్టారు. ఒక వైపు హోర్డింగులు, మరోవైపు మైక్ ప్రచారాలు జోరందుకున్నాయి. అభ్యర్థులు తాజాగా మరో అడుగు ముందుకు వేసి కుల, మత సమీకరణలు ప్రారంభించారు. గడచిన వారం రోజులుగా కులాల వారీగా సమావేశాలు జోరందుకున్నాయి. కుల, మత ప్రాతిపదికన ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడమే లక్ష్యంగా అత్యున్నత న్యాయ స్థానం స్పష్టం చేసిన విషయం విదితమే. అయితే తాజా పరిణామాలపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

అధికారులు సిద్ధం

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రకటించడం, అభ్యంతరాలను స్వీకరించడం వంటి కీలక కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే. మరో వైపు కొత్త ఓట్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యువతను ఓటర్లుగా చేర్పుతున్నారు. రిటర్నింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. అధికార ప్రతిపక్ష పార్టీలతో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించడంతో పాటు రాబోయే ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఎన్నికల కేంద్రాలపై స్పష్టత వచ్చింది. ఓటింగ్ నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు (బియు), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ కంట్రోల్ యూనిట్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షములో వివి ప్యాట్‌ను తనిఖీలు చేసి స్ట్రాంగ్ రూమ్ గొడౌన్ డిపాజిట్ చేశారు. ఇప్పటికే ఫస్ట్‌లెవల్ కమిటీ (ఎఫ్ఎల్‌సి) పరిశీలన ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అత్యంత కీలకమైన వివి.ప్యాట్‌లను లాలా చెరువులోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. సిసి కెమెరా, 24 గంటల పర్యవేక్షణతోకట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

మార్చిలోనే మంటలు

జిల్లాలో మంటలు మొదలయ్యాయి. దీంతో ఉష్ణోగ్రత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. భానుడి ప్రతాపంతో ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత అధికమవుతోంది. ప్రయాణికులు దాహార్తిని తీర్చుకునేందుకు కార్పొరేషన్, మున్సిపాలిటీలు ఇప్పటి వరకూ ఎటువంటి ప్రయత్నాలు చేయకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. మరోవైపు విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరుకోవడంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. జిల్లాలో సరఫరా సంబంధిత సమస్య పేరుతో అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఈ నేపధ్యంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో భీమేశ్వర స్వామి రథోత్సవం వైభవోపేతంగా జరిగింది. మహా శివరాత్రి సందర్భంగా భీమేశ్వర ఆలయ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రారంభమైన ఈ రథోత్సవం అర్ధరాత్రి వరకూ సాగింది. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ప్రారంభించారు. తొలత భీమేశ్వర ఆలయం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవంగా పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌కు తీసుకొచ్చారు. అనంతరం అలంకరించిన రథంపై ఉంచి మరోసారి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిధులు రథాన్ని లాగి లాంచనంగా ప్రారంభించారు. బళ్ళమార్కెట్ సెంటర్, గొల్లగూడెం రోడ్డు మీదుగా నీలమ్మ చెరువు వద్దకు చేరుకుని అక్కడ నుంచి గోలివారి వీధి మీదుగా స్టేషన్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బాణాసంచా కాల్పుల పోటీలను నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామికి భక్తులు హారతి పల్లాలతో స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

భీమేశ్వరుని రథోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయి. 14 రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రధానంగా శివుని బొమ్మ, హనుమంతుని వేషం, కేరళ డ్రమ్స్, ఆంజనేయ నృత్యం, విఘ్నేశ్వరుని బొమ్మలు, కోబ్రా డాన్స్ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ రథోత్సవంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, రాష్ట్ర బిసి అయ్యారక కార్పోరేషన్ చైర్‌పర్సన్ అవాల రాజేశ్వరిలక్ష్మి, ఆలయ ఇఒ బళ్ళ నీలకంఠం, రథోత్సవ కమిటీ నాయకులు, ఆలయ పండితులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తుల మధ్య రథోత్సవం

మూడు వేల మందికి అన్నదానం

మహాశివరాత్రి రథోత్సవం సందర్భంగా శనివారం రాత్రి రథం షెడ్ సెంటర్ వద్ద గోలి వారి వీధిలో 3000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు ఆలోక్ జైన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గొలివారి వీధి, రథంషేడ్ సెంటర్లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలోక్ జైన్, ఆగ్ర నరేంద్ర భాస్కర్, లోకవురెడ్డి విశ్వేశ్వరరావు, విజయ్, సరోజ్ వాసు, వెంకన్నదొర, సంతోష్, చందు, సతీష్ వర్రే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయతీ పరిధిలో వైసిపి గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో గడపగడపకు వైసిపి కార్యక్రమంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానిక ముత్యాలమ్మ గుడి నుంచి ఇంటింటికీ వెళ్లి వైసిపి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పథకాలు అమలు కావాలంటే మరోసారి జగన్ సిఎం కావాలన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, పార్టీ నాయకులు బొంతు మోహన్, భూసారపు పద్మారావు, పిల్లి పరదేశ్వర రావు, బి. శ్రీనివాసు, పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల విధులకు సంబంధించిన సిబ్బంది అందరూ విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. స్థానిక లూథరన్ హై స్కూల్లో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి శనివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఇవిఎంల ద్వారా ఓటు వేసే విధానంపై గ్రామీణ ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. శిక్షణ తరగతులకు హాజరు కాని 29 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించారు.

మహిళా చైతన్యం ద్వారానే సామాజిక వికాసం

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

మహిళా చైతన్యం ద్వారానే సమాజం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ జి.ఉష అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలతో నిర్వహించిన మహిళా దినోత్సవ సభకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలు నూరు శాతం చదువుకుని ఉన్నత విద్యావంతులుగా మారి ఉపాధి రంగంలో ప్రవేశిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సభలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు పి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరి బాయి, నిర్మల, వెంకటరమణ, చంద్రావతి, కళావతి, ఉషారాణి, శ్రీదేవి మహిళా దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఇప్పటికీ మహిళలు దేశంలో ఆర్థిక దోపిడీ, సామాజిక దోపిడీకి గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉన్న చట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఐక్య ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

పెద్దాపురంలో మాట్లాడుతున్న సిడిపిఒ ఉష

మత్స్యకారుల సొమ్ము దోచేస్తున్న ద్వారంపూడి

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారులకు అందాల్సిన సొమ్మును ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి దోచేస్తున్నాడని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్మును నగర పాలక సంస్థ టిడిఆర్ బాండ్ల ద్వారా సుమారు రూ.600 కోట్లు కొట్టేయడంతోపాటు, 2019లో ఒఎన్‌జిసి, జిఎస్‌పిసి ఇచ్చిన సుమారు రూ.1000 కోట్లను దోచుకున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా పరిధిలో చమురు అన్వేషణ నిమిత్తం ఒఎన్‌జిసి సంస్థ సర్వే నిర్వహిస్తోందని, దానిలో నష్టపోయే మత్స్యకారులు ఎంతమంది ఉంటారు? ఆ గ్రామాల్లో ప్రజాభిప్రాయం సేకరించి పరిహారానికి ఎంపిక చేయాలంటూ ఈ ఏడాది జనవరి 9న ఒఎన్‌జిసి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖను పంపిందని తెలిపారు. ఆ లేఖను ప్రభుత్వం ఫిబ్రవరి 9న జిల్లా కలెక్టర్, మత్స్యశాఖలకు సమాచారం అందించిందన్నారు. మార్చి మొదటి వారం నుంచి తాము సముద్రంలో సర్వే పనుల కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపినా ఎంఎల్ఎ ద్వారంపూడి ఆ లేఖను బహిర్గతం చేయకుండా అధికారులను అడ్డుకున్నారన్నారు. రోజురోజుకు తమను ఎంఎల్ఎ ద్వారంపూడి మోసం చేస్తున్నారని గ్రహించి మత్స్యకారులంతా ఉద్యమం చేసేందుకు సిద్ధపడ్డారన్నారు. ఈ విషయం తెలిసిన ద్వారంపూడి మత్స్యకారులకు ఏదో చేస్తున్నానని నటనను ప్రారంభించారన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని మత్స్యకారులకు సుమారు రూ.1000 కోట్ల వరకూ ఆ సంస్థలు విడుదల చేసినా వాటిని మత్స్యకారులకు అందకుండా ద్వారంపూడి, జగన్ సిఎం జగన్‌లు దోచేశారన్నారు. ద్వారంపూడి, సిఎం జగన్లు కలిసి ఆ సంస్థల నుంచి వచ్చిన పరిహారాన్ని ప్రయివేటు ఖాతాలకు మళ్లించి ప్రభుత్వం ఇస్తున్నట్లుగా ప్రచారం చేశారన్నారు. అందుకే తాను వెయ్యి కోట్లను వీళ్లు దోచేసారని చెబుతున్నట్లు అన్నారు. ఫిబ్రవరిలో సర్వే చేయాలం టూ ఉత్తర్వులు వస్తే దానికి మత్స్యకార్లతో ప్రజాభిప్రాయం ఎందుకు సేకరించలేదో కలెక్టర్, మత్స్యశాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి, మత్స్యకార నాయకులు వీరు, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

ఇంటి స్థలంపై సంపూర్ణ హక్కు

ప్రజాశక్తి - కాకినాడ

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇచ్చిన స్థలంపై మహిళలకు సంపూర్ణ హక్కు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఫౌండేషన్ హాస్పిటల్, గాంధీ పార్క్, శారదా దేవి ఆలయ ప్రాంతాల్లో శనివారం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళకు మరింత గౌరవాన్ని పెంచేలా ప్రభుత్వ పథకాలకు మహిళలనే లబ్దిదారులుగా ఎంపిక చేయడం, రాజకీయంగా ఉన్నత పదవుల్లో నియమించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఇళ్ల పట్టాల ద్వారా రాబోయే కాలంలో బ్యాంకుల్లో తనఖా పెట్టుకోవడం, అవసరమైతే బదలాయించుకునేందుకు వెసులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

పట్టాలను అందిస్తున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ నగరంలోని 12 డివిజన్లకు సంబంధించి 6693 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా రిజిస్ట్రేషన్ పేపర్లను స్థానిక సచివాలయాలకు వెళ్లి తీసుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కవాతులో వైసిపి నాయకుని ఓవరాక్షన్

ప్రజాశక్తి - కరప

మండలంలోని గొర్రిపూడి, కరప, ఆరట్లకట్ల గ్రామాల్లో సిఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ రామకృష్ణ సారధ్యంలో కేంద్ర సాయుధ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. అయితే అరట్లకట్ట గ్రామ సర్పంచ్, గ్రామ వైసిపి నాయకుడు ఓవరాక్షన్ చేస్తూ కవాతులో హంగామా చేయడం చర్చానీయాంశంగా మారింది. శాంతిభద్రతల కోసం ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు ధైర్యాన్ని కల్పించేందుకు నిర్వహించే పోలీసు కవాతులో వైసిపి నాయకుడు అగ్రభాగన ఉండి హంగామా చేయడం ఏమిటని స్థానికులు చర్చించుకున్నారు. కవాతులో ఆయనకు ఎలా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కవాతులో అగ్రభాగాన వైసిపి నాయకుడు

పంటలకు సాగునీరు అందించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో పలు ప్రాంతాల్లో ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించాలని ఎంపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చొల్లంగి గ్రామంలో వ్యవసాయ పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ మండలంలో చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జిపేట, నీలపల్లి గ్రామాల్లో ప్రతి ఏడాది నీటి ఎద్దడి ఏర్పడుతుందన్నారు. ఈ సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిస్థితి మారడం లేదన్నారు. చొల్లంగి గ్రామంలో మెయిన్ రోడ్డు తూర్పు భాగంలో 200 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారని అన్నారు. విత్తనం వేసిన దశలోనూ నీటిని అందించలేని స్థితిలో నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారని అన్నారు. ప్రస్తుతం ఆ పొలాలు బీటలు తీస్తున్నాయని, తక్షణమే సాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇరిగేషన్ జెఇతో మాట్లాడి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో శ్రీపాదం సత్యనారాయణ, రేలంగి భద్రం, కట్ట శ్రీనివాసు, రేలంగి చందు, ముంగర శ్రీను రైతులు పాల్గొన్నారు.

రైతులతో పొలాన్ని పరిశీలిస్తున్న రాజబాబు

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కన్నబాబు

కరప: మండలంలోని ఉప్పలంకలో గ్రామ సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్ అధ్యక్షతన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం నడకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. స్థానిక రామకంచిరాజు నగర్‌లో నిర్మించిన తోలుబొమ్మలాట కళాకారుల సంఘం సంక్షేమ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నడకుదురు సర్పంచ్ దేగల లలిత కుమారి, కరప గ్రామ సర్పంచ్ ఆశాజ్యోతి, ఎంపిపి శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై సుబ్బారావు, ఎంపిటిసి సభ్యులు భీమన్న, నాయకులు మద్దూరి గంగ భవాని, సాదే విజయలక్ష్మి, నక్క సత్తిబాబు పాల్గొన్నారు.

పేరు మార్పు

నా యొక్క పాత పేరు **శింగంశెట్టి వెంకయ్యమ్మ,** భర్త: శింగంశెట్టి పట్టాభిరామయ్య, నేను డోరు నెం. 65-2-6/4, సాయి హసిత అపార్టుమెంట్స్, నరసన్న నగర్, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా నందు నివసించుచున్నాను. ఇకమీదట నా పేరు **శింగంశెట్టి రత్నకుమారి,** భర్త: శింగంశెట్టి పట్టాభిరామయ్య, డోరు నెం. 65-2-6/4, సాయి హసిత అపార్టుమెంట్స్, నరసన్న నగర్, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా అని యావన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

కాకినాడ, *08-03-2024*

శింగంశెట్టి వెంకయ్యమ్మ

నేరాలు ఘోరాలు

సచివాలయ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పనసపాడు గ్రామ సచివాలయం విద్యుత్ ఉద్యోగి రాజు విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని వి.కె.రాయపురం గ్రామ సమీపాన 11కెవి వైరు, ఇతర మరమ్మతు పనుల్లో నిమగ్నమై ఉండగా విద్యుత్ షాకుకు ఆయన గురయ్యారు. విద్యుత్ లైన్ నిర్వహణలో లైన్‌మెన్ అలసత్వం వహించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని ట్రాన్స్‌కో అధికారులు వెల్లడించారు. దీనిపై రాజు బంధువులు ట్రాన్స్‌కో అధికారుల తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రమాదానికి గురియైన రాజును చికిత్స నిమిత్తం మాధవపట్నంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సూర్య గ్లోబల్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గ్యాస్ లీకైన ప్రమాదంలో గృహిణికి గాయాలు

ప్రజాశక్తి - మండపేట

ఒక ఇంట్లో గ్యాస్ లీక్ కావడంతో గృహిణికి గాయాలయ్యాయి. స్థానికులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైతు బజార్ ఎదురుగా ఉన్న వీధిలో కొత్తల అప్పారావు భార్య కృష్ణవేణి కలిసి జీవిస్తున్నారు. శనివారం ఉదయం వంట చేసేందుకు కృష్ణవేణి గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో ఆమె కేకలు పెట్టింది. చుట్టుపక్కల వారు ఇది గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. మండపేట అగ్నిమాపక అధికారి హనుమంతరావు, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.రెండు లక్షల ఆస్తి నష్టంతో పాటు గృహిణి స్వల్పంగా గాయపడిందని అగ్నిమాపక అధికారి తెలిపారు.

ఇవిఎం, వివి ప్యాట్‌ల వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ

ఇవిఎం, వివి ప్యాట్‌ల వినియోగంపై ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. స్థానిక పిఆర్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కాకినాడ అర్బన్ నియోజకవర్గ ఆర్‌ఒ, నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పర్యవేక్షించారు. ఇవిఎం, వివి ప్యాట్ పనితీరుపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కల్పించుకోవాలని సూచించారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న దానిని రానున్న ఎన్నికల్లో ఆచరణలో పెట్టాలన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరగడంలో ఎన్నికల సిబ్బంది పాత్ర అత్యంత ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అర్బన్ తహశీల్దార్ దొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల డిటి సీతాపతిరావు, నాయుడు, దీపక్, పవన్ పాల్గొన్నారు.

మర్రిపాకలో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మర్రిపాక గ్రామంలో శనివారం ఇంటింటికి టిడిపి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొని ఇంటింటికి తిరిగి తన తండ్రి జ్యోతుల నెహ్రూకు ఓటు వేయాలని కోరారు. తన తండ్రి రాబోయే కాలంలో తీసుకున్న 5 హామీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఎపిఐఐసి కాలనీలో మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు మాట్లాడుతూ అర్హులైన వారికి చేయూతనిచ్చి ఆదుకోవడమే మానవత్వమన్నారు. మానవసేవయే మాధవ సేవగా భావించి కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటున్న మీకోసం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభినందనీయులని అన్నారు. రోజువారి సంపాదనలో కొంత శాతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించడం అభినందనీయమని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు పిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ నిస్సహాయులకు సహాయ పడాలనే లక్ష్యంతో ప్రతి నెల ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బాబి, మూర్తి, సందీప్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం సాగుపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో శనివారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. లద్దె పురుగు, కత్తెర పురుగు నివారణ కై విషపు ఎరను తయారు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రుపశ్రి, శ్వేత, అనురాధ, వీరభద్రరావు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక హైస్కూల్‌లో శనివారం పిఒ, ఎపిఒలుగా విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవిఎంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్నికల్లో ఉపయోగించే ఇవిఎంలపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ప్రశాంతత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వృద్ధాప్యంలో సంతోషంగా, ప్రశాంతంగా గడిపేందుకు కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు అన్నారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధాప్యంలో సంతోషకరమైన జీవితం, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమన్నారు. సాధించిన విజయాలతో, అర్జించిన సంపదతో సంవృప్తి చెంది ఆత్మవిశ్వాసంతో మెరగాలన్నారు. శక్తికి మించిన ప్రయాసలకు గురికారాదని అన్నారు. రోజు వాకింగ్ చేయాలని, సానుకూలమైన ధోరణితో ఉత్సాహంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రామారావు, రవిశంకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

అసెంబ్లీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా సత్తిబాబు

ప్రజాశక్తి - యానాం

కాంగ్రెస్ పార్టీ యానాం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా మల్లాడి సత్యనారాయణ(సత్తిబాబు)ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఫెర్రీ రోడ్డులో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అభిమానులు మల్లాడి సత్తిబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్, ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దున్నా చక్రవర్తి, లంక బంగారం, మున్నా, చౌదరి, అంజయ్య, శ్రీను, గణేష్, చంటి, ప్రసాద్, బాబి పాల్గొన్నారు.

సత్తిబాబును సత్కరించిన అభిమానులు

11న నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజా పనుల శాఖ ద్వారా టౌన్ వాటర్ వర్క్స్ వద్ద నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా ఈనెల 11న మెట్టకూరు, గోపాల్ నగర్, అంబేద్కర్ నగర్, కురసం పేట, ఫ్రాన్స్ తిప్ప గ్రామాల్లో సాయంత్రం పూట మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ కాళ్ల నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు సహకరించి ముందుగానే నీటిని నిలువ చేసుకోవాలని ఆయన కోరారు.

రీజెన్సీ విద్యార్థినులకు పురస్కారాలు

ప్రజాశక్తి - యానాం

చిత్ర బ్రహ్మ బాపు 90వ జయంతి సందర్భంగా కళానిలయం ఆధ్వర్యంలో బాపు చిత్రకళా వేడుకలు హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజెన్సీ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న 16 మంది విద్యార్థినులకు చిత్రకళా పురస్కారాలు లభించాయని హెచ్ఎం టివిఎస్ఎస్వి.ప్రసాద రావు శనివారం తెలిపారు. త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో ప్రముఖ సినీ నటుడు హరీష్ చేతుల మీదుగా బాపు చిత్రకళ పురస్కారం, జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను, పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయురాలు పెన్మత్స ప్రశాంతి లను ఆయన అభినందించారు.

ఉత్సవాలకు ఆభరణాలతో అలంకరించాలి

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 11 నుంచి ప్రారంభం అయ్యే వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో స్వామికి ఆభరణాలతో అలంకరించాలని ఉత్సవ నిర్వాహకులు పరిపాలనాధికారి మునిస్వామిని కోరారు. ఆర్ఒ ఛాంబర్‌లో శనివారం ఆయనతో నిర్వాహకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కల్యాణ ఉత్సవాలకు స్వామికి ఆభరణాలు అలంకరించలేదని, ఈ ఏడాదైనా ఆభరణాలతో అలంకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు నల్లం సురేష్, బెజవాడ నిరంజన్, నక్కల సుబ్బన్న, పులవర్తి శీను, పండు సిద్ధార్థకుమార్, చిక్కాల నరసింహమూర్తి, సబ్బతి లోకేష్, లక్ష్మీ బాయ్ పాల్గొన్నారు.

11 నుంచి మీసాల వెంకన్న కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్న కళ్యాణోత్సవాలను ఈ నెల 11 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖండవల్లి రామకృష్ణ తెలిపారు. స్థానికంగా శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ కళ్యాణోత్సవం సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దంపతులు స్వామికి సువర్ణ మంగళసూత్రం, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు దంపతులు యజ్ఞోపవీతం, తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం తరపున పరిపాలనాధికారి మునిస్వామి దంపతులు స్వామికి పట్టు పీతాంబరాలు సమర్పిస్తారని తెలిపారు.

In the Court of the IVth Additional Junior Civil Judge at Kakinada
O.S. No. 244/2020

Between:
Tadi Veera Venkata Satyanarayana ...*Plaintiff*
AND
Tadi Suryanarayana (died) and Others ...*Defendants*
To:
3rd Defendant:
Tadi Suryanarayana alias Suribabu, S/o. (late) Suryanarayana, aged 40 years, Thota Thrimurthulu Colony, Thota peta, Draksharamam.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు సమన్లు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుడగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 27-3-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం.జవహర్ అలీ
అడ్వకేట్, డోర్ నెం.25-6-11,
గంజాం వారి వీధి, కాకినాడ
సెల్: 9848307906

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM XIII ADDITIONAL METROPOLITAN MAGISTRATE, AT ANAKAPALLE
O.S. No 71/2023

Between:
1. Jonnarapu Rajeswari
2. Jonnarapu Sravani
3. Jonnarapu Divya
4. Jonnarapu Vanitha ... Plaintiffs

And:
Sivakota Ashirvadam ... Defendant

NOTICE

To:
Sivakota Ashirvadam,
S/o Peda Appa Rao, D.No 9-171,
Kothapeta Village Gollapudi,
East Godavari District.

Please take notice that the above suit, which is filed against you for grant of permanent injunction, stands posted to **28-03-2024** for your appearance. If you have any objection you may attend either personally or through an advocate before the above said Court at **10.30 A.M. on 28-03-2024** failing which the matter will be decided exparte in your absence.

(By order of the Court)
KANDREGULA LEELA HARI PRASAD,
Advocate, Gajuwaka,
Visakhapatnam-26,
Visakhapatnam, Cell: 81432 72790
Dt: 09-03-2024

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 395/2023

Between:
UCO Bank, rep. by its Branch Manager, Rajamahendravaram Branch, Rajamahendravaram. ...*Plaintiff*
AND
D-1: Yedla Shyam Kumar, S/o. Srinivasa Rao, Hindu, aged 32 years, R/o. D.No. 44-13-95, Ramalayam Street, Annapurnamma peta, Rajahmundry, E.G.Dist.,
D-2: Kota Chandra Sekhar, S/o. K.Lakshmana Rao, Hindu, aged 35 years, R/o. Sri Nilayam Apartments, Rajahmundry, E.G.Dist., ...*1, 2 Defendants*

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 20-3-2024 సం||రం తేదీ ఉదయం 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.వి.కె.రమేష్
డి.వాణి రమేష్
రాజమండ్రి
10-3-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

In the Court of the Principal Junior Civil Judge at Kakinada
I.A. No. 204/2023 in O.S. No. 157/2023

Between:
State Bank of India, Retail Assets, Small & Medium Enterprises Center, Kakinada, Rep. by its Authorized Signatory, Visamsetty Rajasekhar. ...*Petitioner/ Plaintiff*
AND
Sodabathula Sai Kumar and Others ...*Respondents/ Defendants*
To:
Respondents/ Defendants:
1) Sodabathula Sai Kumar, S/o. Sodabathula Sesha Giri, aged 26 years, Student, R/o. Door No. 3-18A-7/1A, Ayodya Nagar, Kakinada.
2) Sodabathula Seshagiri, S/o. Venkatarao, aged 45 years, Business, R/o. Door No. 3-18A-7/1A, Ayodya Nagar, Kakinada.

పై నెంబరు దావా మరియు పిటిషన్‌లో 1వ మరియు 2వ ప్రతివాదులు/ రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు I.A. No. 204/2023 నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 19-04-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మరియు పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.V.LAKSHMAJI RAO
Advocate, Kakinada
Cell: 9866211196